sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 25-07-2026 శనివారం | సంపుటి-02 సంచిక : 111 EDITOR: ROHINI



మోడీ డిజిటల్ సామ్రాజ్యం షేక్

న్యూయార్క్ టైమ్స్ సంచలనాత్మక స్టోరీ

The New York Times

India Protests | What to Know | Timeline

Phones in Hand, India's Young Protesters Blast Through Modi's Media Control

Prime Minister Narendra Modi's tightly constructed image is being punctured as a Gen Z-led protest movement uses videos and memes to seize the digital narrative.

దశాబ్దాలుగా తిరుగులేని నేతగా చెలామణి అవుతున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇమేజ్‌కు ఇప్పుడు భారీ షాక్ తగులుతోంది. ఏళ్ల తరబడి సోషల్ మీడియాను గుప్పెట్లో పెట్టుకుని దేవుడిలా భావించిన ఆయనకు ఇప్పుడు కొత్త తరం నుంచి తీవ్రమైన సెగ తగులుతోంది. వీడియోలు, మీమ్స్, ఆగ్రహంతో డిజిటల్ ప్రపంచాన్ని కుదిపేస్తున్న యువత మోడీ సామ్రాజ్యానికి ఎదురునిలిచి ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. - సహనం వందే, అమెరికా

- జెన్ జెడ్ తిరుగుబాటు... డిజిటల్ వార్ షురూ
- నెటిజన్ల అసహనం... మోడీకి పెద్ద సవాల్
- రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు
- భారత ప్రధాని ఇమేజ్ డ్యామేజ్

భారత ప్రధాని నరేంద్ర మోడీ గడిచిన 10 ఏళ్లకు పైగా సోషల్ మీడియాను అత్యంత శక్తివంతమైన ఆయుధంగా వాడుకున్నారని ప్రముఖ అంతర్జాతీయ అమెరికా పత్రిక 'న్యూయార్క్ టైమ్స్' వ్యాఖ్యానించింది. దీనికి సంబంధించి శుక్రవారం ఆన్ లైన్ ఎడిషన్ లో ప్రత్యేక కథనం రాసింది. ఎక్కడా తప్పు చేయని దేవుడిలా తన ఇమేజ్‌ను ప్రజల్లో బలంగా నాటుకునేలా వ్యూహాలు రచించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లన్నింటినీ తన చెప్పుచేతల్లో ఉంచుకుంటూ ప్రత్యర్థులపై పైచేయి సాధించారు. డిజిటల్ రంగంలో తిరుగులేని చక్రవర్తిగా ఆయన తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ దశాబ్ద కాలంలో మోడీని ప్రశ్నించే నాథుడే లేడనే భ్రమను ఆయన వర్గం సృష్టించింది.

జెన్ జెడ్ కొత్త తరంగం

ఇప్పుడు సరికొత్తగా పుట్టుకొచ్చిన యువతరం రూపంలో మోడీకి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. జెన్ జీ అని పిలువబడే నేటి తరం యువత మోడీకి వ్యతిరేకంగా రోడ్డెక్కింది. కేవలం రోడ్ల మీదే కాకుండా డిజిటల్ రంగం లోనే ఆయనకు చుక్కలు చూపిస్తోంది. పదేళ్లుగా సాగుతున్న మోడీ ఏకఛత్రాధిపత్యానికి ఈ కొత్త తరం డిజిటల్ పోరు గట్టి ఎదురుదెబ్బ తగులుతోంది. ఏళ్ల నాటి మోడీ ఇమేజ్‌ను ఈ యువత ఒక్కసారిగా బద్దలు కొడుతోంది.

డిజిటల్ రణరంగంలో మీమ్స్ సునామీ...

మోడీని ఎదుర్కొనేందుకు నేటి యువత సోషల్ మీడియాయే అస్త్రంగా మలచుకుంది. వీడియోలు, మీమ్స్ రూపంలో విరుచుకుపడుతూ నెట్టింట పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. మోడీ ప్రచార వ్యూహాలకు వ్యతిరేకంగా వినూత్న రీతిలో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తోంది. అధికార పార్టీ సోషల్ మీడియా దళాలను సైతం ఈ యువత తమ డిజిటల్ వ్యూహాలతో కట్టడి చేస్తోంది. మీమ్స్, వీడియోల ద్వారా మోడీ ప్రభుత్వాన్ని కార్నర్ చేస్తూ డిజిటల్ నరేటివ్‌ను పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకుంది.

మోడీ తీరుపై అసంతృప్తి

యువతలో ఆగ్రహం ఇప్పుడు తారాస్థాయికి చేరింది. మోడీ పరిపాలన తీరుపై వారి గుండెల్లో పేరుకుపోయిన అసంతృప్తి అగ్నిలా మండుతోంది. ఏమాత్రం భయపడకుండా తమ గళాన్ని సోషల్ మీడియా వేదికగా బహిరంగంగానే వినిపిస్తున్నారు. ఈ జనరేషన్ చూపుతున్న కోపం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ ఈ యువత చేస్తున్న పోరాటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

ఏళ్ల నాటి కోట కదిలిపోతోంది

పదేళ్ల కాలంలో ఎవరూ టచ్ చేయని విధంగా నిర్మించుకున్న మోడీ ఇమేజ్ ఇప్పుడు కరిగిపోతోంది. ఏ తప్పూ చేయలేదనే ఆయన దైవత్వం ఇమేజ్‌ను ఈ యువత తునాతునకలు చేస్తోంది. మోడీ ఎదుర్కొంటున్న సవాళ్లలో ఇదే అత్యంత ప్రమాదకరమైనదిగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దశాబ్ద కాలంగా ఆయన సాగించిన డిజిటల్ రాజకీయాలకు ఈ యువత పోరాటంతో బ్రేక్ పడే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు

ఈ అనూహ్య పరిణామంతో రాబోయే రోజుల్లో మోడీ రాజకీయ ప్రస్థానంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. డిజిటల్ రణరంగంలో ఓడిపోతున్నామనే భయం ఇప్పుడు అధికార పార్టీలో స్పష్టంగా కనిపిస్తోంది. యువత చూపుతున్న పట్టుదల మోడీని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది. దశాబ్ద కాలపు రాజకీయ ఆధిపత్యానికి ఈ డిజిటల్ తిరుగుబాటు రూపంలో పెద్ద ఎసరు పెట్టింది.

న్యూయార్క్ టైమ్స్ వాడిన వీడియోలో ఒక భాగం

బ్లూటూత్ చాటింగ్

ఇంటర్నెట్ లేని టెక్నాలజీతో చాటింగ్

ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్ అవసరం లేకుండా కేవలం బ్లూటూత్ సాయంతోనే మెసేజ్‌లు పంపుకునేలా వచ్చిన ఒక సరికొత్త యాప్ ఇప్పుడు దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. నిఘా కళ్లకు చిక్కకుండా, ఎలాంటి రికార్డులు లేదా ట్రాకింగ్ లేకుండా రహస్యంగా సమాచారాన్ని మార్చుకోవడానికి అడ్డాగా మారుతున్న ఈ టెక్నాలజీపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది.
- సహనం వందే, హైదరాబాద్

- బిట్‌చాట్ యాప్‌తో సర్కారుకు తలనొప్పి
- ఢిల్లీ విద్యార్థుల పోరాటంలో విరివిగా వాడకం
- దేశ భద్రతకు ముప్పుగా భావించి ఉక్కుపాదం

ఈ డిజిటల్ యుగంలో వాట్సాప్ లేదా టెలిగ్రామ్ వంటి యాప్‌లు పనిచేయాలంటే కచ్చితంగా మొబైల్ డేటా లేదా వైఫై ఉండాల్సిందే. కానీ ఏలాంటి ఇంటర్నెట్ లేదా సెల్యులార్ నెట్‌వర్క్ అవసరం లేకుండా కేవలం బ్లూటూత్ సాయంతోనే మెసేజ్‌లు పంపుకునేలా ఒక సరికొత్త టెక్నాలజీ మార్కెట్లోకి వచ్చింది. అదే బిట్ చాట్ యాప్. టెక్నాలజీ పరంగా ఇది చాలా అడ్వాన్స్‌డ్ అనిపించినా దీని వెనుక ఉన్న అసలు ప్రమాదం మాత్రం ఎవరికీ తొలుత అర్థం కాలేదు. ఇంటర్నెట్ లేకపోతే ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని భయపడే ఈ రోజుల్లో, ఇంటర్నెట్ లేకపోయినా నేరాలకి పాల్పడే కొత్త దారులు వెతుకుతున్నారంటే టెక్నాలజీ ఏ స్థాయికి చేరుకుందో అర్థం చేసుకోవచ్చు.

పీర్ టు పీర్ విధానం

సాధారణంగా మనం వాడే చాటింగ్ యాప్‌లన్నింటికీ ఒక సర్వర్ ఉంటుంది. మనం పంపే మెసేజ్ ఆ సర్వర్ ద్వారా అవతలి వారికి చేరుతుంది. కానీ ఈ బ్లూటూత్ ఆధారిత యాప్ పూర్తిగా పీర్-టు-పీర్ విధానంలో పనిచేస్తుంది. అంటే మధ్యలో ఏ సర్వర్ లేదా టవర్ సంబంధం లేకుండా మన ఫోన్‌లోని బ్లూటూత్ పరిధిలో ఉన్న మరో ఫోన్‌తో నేరుగా కనెక్ట్ అవుతుంది. ఒకరి నుంచి మరొకరికి చైన్ సిస్టమ్ లాగా ఈ మెసేజ్‌లు ముందుకు పాస్ అవుతాయి. చూడటానికి ఇది చాలా సింపుల్ టెక్నాలజీలా అనిపించినా దీనివల్ల జరిగే అనర్థాలు చాలా పెద్దవిగా ఉంటాయి.

భద్రతా దళాలకు తలనొప్పి

ఇలాంటి యాప్‌లు సాధారణ ప్రజల వాడకం కోసం కాకుండా అత్యవసర సమయాల్లో లేదా విపత్తులు వచ్చినప్పుడు కమ్యూనికేషన్ కోసం తయారు చేస్తుంటారు. కానీ కొందరు దీనిని వ్యూహాత్మకంగా తప్పుడు మార్గాలకు వాడుకోవడం మొదలుపెట్టారు. ముఖ్యంగా ప్రభుత్వాల నిఘా కళ్లకు చిక్కకుండా, ఎలాంటి రికార్డులు లేదా ట్రాకింగ్ లేకుండా రహస్యంగా సమాచారాన్ని మార్చుకోవడానికి ఇవి అడ్డాగా మారుతున్నాయి. ఏజెన్సీల కంటికి కూడా చిక్కకుండా ఈ మెసేజ్‌లు ప్రయాణిస్తుండటంతో భద్రతా దళాలకు ఇది పెద్ద తలనొప్పిగా మారింది.

గిట్‌హబ్ నుంచి తొలగింపు

ఢిల్లీలో జరిగిన విద్యార్థుల పోరాటాల సందర్భంగా ఈ యాప్‌ను ఉపయోగించినట్లు కేంద్రం గుర్తించింది. దేశ భద్రతకు, శాంతిభద్రతలకు ఇది ముప్పుగా మారుతుందని నిపుణులు హెచ్చరించడంతో సంబంధిత టెక్ సంస్థలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ముఖ్యంగా డెవలపర్లు కోడింగ్ షేర్ చేసుకునే ప్రముఖ ప్లాట్‌ఫారమ్ అయిన గిట్‌హబ్ నుంచి ఈ యాప్‌ను తక్షణమే తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలను గౌరవిస్తూ గిట్‌హబ్ అధికారులు వెంటనే ఆ యాప్‌కు సంబంధించిన డేటాను, ఫైళ్లను తమ ప్లాట్‌ఫారమ్ నుంచి పూర్తిగా డిలీట్ చేశారు.

ఫ్రెండ్‌షిప్ పేరెంటింగ్.. డేంజరస్ ట్రెండ్

అతి స్నేహంతో పిల్లల్లో క్రమశిక్షణ గల్లంతు

- రూల్స్ లేని పెంపకం... బాధ్యత లేని పిల్లలు
- ఎమోషనల్ సపోర్ట్ పేరిట నిర్లక్ష్యం
- కఠినమైన రూల్స్ లేకపోతే నష్టం
- బ్యాలెన్స్ లేకుంటే జీవితం ఫెయిల్

నేటి సమాజంలో పిల్లలను పెంచే పద్ధతుల్లో పెద్ద విప్లవమే వస్తోంది. ఒకప్పుడు తల్లిదండ్రులంటే పిల్లలంటే భయం, భక్తి ఉండేవి. కానీ నేటి తరం పేరెంట్స్ ఆ గీతలను చెరిపేస్తున్నారు. పిల్లలు తమ మనసులోని ఆందోళనలు, భయాలు, ఫెయిల్యూర్స్ ను ఎటువంటి మొహమాటం లేకుండా తల్లిదండ్రులతో పంచుకోవాలని కోరుకుంటున్నారు. పరిశోధనలు కూడా చిన్నతనంలో తల్లిదండ్రులతో మంచి బంధం ఉన్న పిల్లలు పెద్దయ్యాక మానసికంగా ఎంతో ఆరోగ్యంగా ఉంటున్నాయని పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.
- సహనం వందే, హైదరాబాద్

జెన్-జీ తరం పిల్లలు గతంలో ఎన్నడూ లేనంతగా మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో పేరెంట్స్ ఒక స్నేహితుడిగా పక్కన ఉండి వారి మాట వింటే సగం టెన్షన్ తగ్గిపోతుంది. చిన్న విషయానికి కూడా కుంగిపోయే నేటి పిల్లలకు ఈ ఎమోషనల్ సపోర్ట్ ఒక పెద్ద కవచంలా మారుతుంది. ఏ సమస్య వచ్చినా ఇంట్లోనే పరిష్కారం దొరుకుతుందనే భరోసా ఉంటే పిల్లలు చెడు వ్యసనాల వైపు లేదా తప్పుడు దారుల వైపు వెళ్లే అవకాశాలు చాలా వరకు తగ్గిపోతాయి.

గీత దాటితేనే అసలు సమస్య

ఫ్రెండ్లీగా ఉండటానికి, అతిగా లైట్ తీసుకోవడానికి మధ్య సన్నని గీత ఉంటుంది. దాన్ని దాటితే మాత్రం అసలు సమస్య మొదలవుతుంది. పిల్లలకు అన్నీ తామే అయిపోయి, వాళ్ళు ఏ తప్పు చేసినా నవ్వుకుంటూ ఊరుకుంటే అది పేరెంటింగ్ కాదు... నిర్లక్ష్యం అవుతుంది. పిల్లలు ఎక్కడైనా తప్పు చేస్తే కఠినంగా మొట్టికాయ వేయాల్సిన చోట కూడా ఫ్రెండ్ షిప్ ముసుగులో వదిలేస్తే ఆ పిల్లలు సమాజంలో ఎదగలేరు.

ప్రేమతో పాటు కఠినమైన రూల్స్ అవసరం

నిపుణులు చెబుతున్న దాని ప్రకారం పర్ఫెక్ట్ పేరెంటింగ్ అంటే కేవలం గారాభం చేయడం కాదు. దీన్ని అథరైటివ్ పేరెంటింగ్ అంటారు. అంటే ప్రేమను పంచడంలో ముందుండాలి. అదే సమయంలో కొన్ని కఠినమైన రూల్స్ పెట్టడంలోనూ వెనకడుగు వేయకూడదు. కేవలం స్నేహం పేరుతో పిల్లలకు ఎలాంటి బాధ్యతలు అప్పజెప్పకుండా, ఎటువంటి క్రమశిక్షణ నేర్పకపోతే వారిలో ఆత్మవిశ్వాసం పూర్తిగా దెబ్బతింటుంది.

బయటి ప్రపంచాన్ని ఎదుర్కొనే ధైర్యం

ఇంట్లో ఏ రూల్స్ లేకపోతే బయటి ప్రపంచం పెట్టే నిబంధనలను పిల్లలు జీర్ణించుకోలేరు. స్కూళ్లలో తోటివారితో కలిసిపోవడం, టీచర్లు చెప్పే క్రమశిక్షణను పాటించడం వారికి పెద్ద శిక్షలా అనిపిస్తుంది. అందుకే కేవలం కౌగిలింతలు, ముద్దులతో పాటు సరైన సమయంలో కఠినమైన నో చెప్పే ధైర్యం కూడా తల్లిదండ్రులకు ఉండాలి. ఎమోషనల్ సపోర్ట్ ఇస్తూనే ఒక గైడ్ లా వెనుక ఉండి నడిపించే పేరెంట్స్ మాత్రమే పిల్లలను నిజమైన విజేతలుగా మారుస్తారు.

స్కూల్స్ సైకాలజీ... పేరంటాలజీ

ఈ సరికొత్త పేరెంటింగ్ ట్రెండ్‌ను అందిపుచ్చుకోవడంలో ఇప్పుడు పెద్ద పెద్ద స్కూల్స్ కూడా ముందుంటున్నాయి. కేవలం మార్కులు మాత్రమే కాకుండా పిల్లల మానసిక వికాసానికి స్కూల్, ఇల్లు కలిసికట్టుగా పనిచేయాలని నిపుణులు వాదిస్తున్నారు. కొన్ని స్కూల్స్ పేరంటాలజీ లాంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా పేరెంట్స్ కి నేటి తరం పిల్లల సైకాలజీని అర్థం చేసుకునే మెలకువలు నేర్పిస్తున్నాయి. ఇల్లు బేస్ అయితే స్కూల్ వేదిక అవుతుంది, ఈ రెండూ కలిస్తేనే పిల్లల భవిష్యత్తు భద్రంగా ఉంటుంది.

గైడ్ స్థానం ముఖ్యం

పేరెంటింగ్ అనేది ఏనాడూ ఒకేలా ఉండే స్థిరమైన సైన్స్ కాదు. మారుతున్న కాలానికి తగినట్లుగా తల్లిదండ్రులు కూడా మారుతున్నారు. కానీ మారుతున్నామనే పేరుతో పిల్లలకు మీరే బెస్ట్ ఫ్రెండ్స్ అయిపోయి పేరెంట్స్ స్థానాన్ని మాత్రం ఎప్పటికీ కోల్పోకండి. పిల్లలు స్నేహితుడి లాంటి ప్రేమను కోరుకుంటారు, కానీ అదే సమయంలో తను దారి తప్పినప్పుడు గట్టిగా పట్టుకుని నిలబెట్టే ఒక గురువును కూడా నమ్ముకుంటారు. ఆ బ్యాలెన్స్ ఎక్కడైతే దొరుకుతుందో అక్కడే నిజమైన మంచి పేరెంటింగ్ పుడుతుంది.